ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5★★
జగిత్యాల
జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025

చక్కర కర్మాగారం పునః ప్రారంభంపై దృష్టి సారించాలి

-వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముత్యంపేట చక్కర కర్మాగారం పునః ప్రారంభంపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభ వ్యవహారంపై వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, డైరెక్టర్ ఆఫ్ షుగర్ సీ.హెచ్ నర్సిరెడ్డిలతో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సత్య ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ముత్యంపేట చెరుకు రైతులతో పరిశ్రమలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక రైతులతో ఈనెల 26న ప్రత్యక్షంగా సమావేశం నిర్వహించడానికి పరిశ్రమలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రత పటిష్టం చేయాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ యాదగిరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, మెట్‌పల్లి ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు, అసిస్టెంట్ చెరుకు కమిషనర్ వెంకట రవి పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలి

-మాజీ మంత్రి జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీజిల్ ధరలు తగ్గించడంతోనే నిత్యావసరాల ధరలు తగ్గి వినియోగదారుడికి వెసులుబాటు కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా జీఎస్టీ పన్నుల విధానంపై వాస్తవాలను గ్రహించడం సంతోషకరమని అన్నారు. వినియోగదారులు ఎనిమిది సంవత్సరాలుగా ఆర్థిక భారం మోస్తున్నారన్నారు. జీఎస్టీ స్లాబ్‌లు 5,18, 10 స్లాబ్‌లు గా ఏర్పాటు చేయడంను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రతి వస్తువుపై గతంలో ఉన్న రేటును ప్రస్తుతం ఉన్న రేటును దుకాణాల ముందు ప్రదర్శించాలన్నారు.

పాత స్టాక్ పేరిట పాత పన్ను విధానం పేరుతో వినియోగదారుడిపై భారం మోపడం సరికాదన్నారు. జీఎస్టీ పన్నుల విధానాన్ని జిల్లా పరిపాలన యంత్రాంగం పర్యవేక్షించాలని జీఎస్టీ ఫలితాలు వినియోగదారుడికి చేరాలని సూచించారు. నూగన జీఎస్టీ అమలుతో ఆదాయం కోల్పోతున్న రాష్ట్రాలకు కేంద్రం ఆదాయం సమకూర్చాలని ఆయన సూచించారు. పన్నుల్లో రాష్ట్రాలకు 60శాతం కేటాయించాలని అన్నారు. పొగాకు, మాదక ద్రవ్యాలను జీఎస్టీ పరిధిలో చేర్చడంపై ఎవరికీ భిన్నాభిప్రాయాలు లేవని జీవన్‌రెడ్డి అన్నారు. నిత్యావసరాలు కూడా పెట్రోల్, డీజిల్ ధరలపై ఆధారపడి ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాన్ని తీసుకుని ప్రధాని మోదీ పెట్రోల్, డీజిల్‌పై దేశ వ్యాప్తంగా ఒకే పన్ను ఉండే విధానం అమలు చేయాలని జీవన్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు జున్ను రాజేందర్, మాజీ కౌన్సిలర్ కండ్లపెల్లి దుర్గయ్య, మాజీ ఎంపీటీసీ శీలం సురేందర్, గుండా మధు, పంజాల రఘు, కమలొద్దీన్, చీటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో వర్షం

వెల్గటూర్, సెప్టెంబరు 23: వెల్గటూర్‌లో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వానకు గాలి తోడు కావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెల్గటూర్, వెంకటాపూర్ గ్రామాల శివారులో వెల్గటూర్- జగిత్యాల రోడ్డుపై చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీనితో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మండలంలో 5.3 మి.మీ వర్షపాతం నమోదైంది. కొన్ని చోట్ల వరి పొట్ట దశకు వచ్చే సమయంలో వర్షాలు పడుతుండడంతో పంట ఎక్కడ నష్టం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగే వర్షాలు పడితే పత్తి పంటకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ



- కసరత్తు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- కమిషనరేట్‌కు స్థానాల వారీగా జాబితా
- నెలాఖరులోగా స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఆయా పార్టీల్లో, ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల వ్యవహారం ఎటూ తేలకపోవడంతో ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా ప్రభుత్వం కూడా రిజర్వేషన్ల ఖరారుపై దృష్టి సారించింది. రెండు రోజులుగా ఈ వ్యవహారంపై అధికార వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. రిజర్వేషన్లు ఖరారైతే నెలాఖరులోగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఆశావహులు తమకు రిజర్వేషన్లు అనుకూలి స్తాయోలేదోనని ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 385 పంచాయతీలు

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం 2024 ఫిబ్రవరి 1న ముగిసింది. 16 నెలల నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సైతం 2024 జూన్‌తో గడువు ముసిగింది. ప్రస్తుతం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను పునర్విభజన చేయగా ఈనెల 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

జిల్లాలోని 385 పంచాయతీలు, 3,536 వార్డులు అంతేస్థాయిలో పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. 205 ఎంపీటీసీ, 20 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు జరుగుతోంది. పోలింగ్ రెండు విడతల్లో నిర్వహించడానికి నిర్ణయించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో స్థానిక సంస్థల వివరాలు..

జడ్పీటీసీ స్థానాలు	20
ఎంపీటీసీ స్థానాలు	216
ఎంపీపీ స్థానాలు	20
సర్పంచ్ స్థానాలు	385
వార్డులు	3,586
పంచాయతీ ముసాయిదా ఓటర్లు	6,07,222
పురుషులు	2,89,249
మహిళలు	3,17,964
ఇతరులు	9

ప్రధాన అడ్డంకి రిజర్వేషన్లే..

స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యేందుకు రిజర్వేషన్ల వ్యవహారమే ప్రధాన అడ్డంకిగా మారింది. 2019 ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 గ్రామ పంచాయతీ చట్టాన్ని తీసు కువచ్చింది. ఈ చట్టం ప్రకారం జీపీల రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లు మారనున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించా లని నిర్ణయించడంతో ప్రభుత్వం రిజర్వే షన్లపై ఎలా ముందుకు వెళ్తుందో అనే ఉత్కంఠ నెలకొంది.

ఎన్నికల పనుల్లో అధికారుల బిజీ

ఎన్నికల్లో రిజర్వేషన్ విధానాన్ని ఖరారు చేసేం దుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జడ్పీటీసీ, జడ్పీచైర్మన్, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. సీఎస్ ఆదేశాలతో జిల్లాల వారీగా రిజర్వేషన్ల విధానం అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

బీసీలకు 42 శాతం, ఎస్సీ ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లు ప్రకటించనున్నారు. ఇక షెడ్యూల్డ్ ఏరియాలో ఎస్టీ జనాభా ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించి, వంద శాతం ఎస్టీ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవులు వారికే రిజర్వే చేయనున్నట్లు అధికార వర్గాలు అంటున్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయంలో రిజర్వేషన్ల ప్రక్రియపై కసరత్తు జరుగుతోంది.

రెండు రోజుల్లోనే ప్రక్రియ..

గ్రామ పంచాయతీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీల ఎన్నికలకు రిజర్వేషన్లను కేటాయించే బాధ్యతలను ప్రభుత్వం సంబంధిత అధికారులకు అప్పగించింది. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు కేవలం ఒకటి, రెండు

మిగతా 8వ పేజీలో

ఆర్థిక సహాయం

భీమారం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలలో 1995-96 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు తమ మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసి ఉదారతను చాటుకున్నారు. బాల్యంలో కలిసి ఆడుకున్న మిత్రుల్లో ముగ్గురు పలు కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న మిత్రులు కుటుంబాలు కష్టాల్లో ఉన్నాయని గుర్తించి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జగిత్యాల జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ పిలుపు నిచ్చారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని సీఐటీయూ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా శ్రామిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. మహాసభలకు భారీ సంఖ్యలో అన్ని వర్గాల వారు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ ఇందూరి సులోచన, బొర్ర శేఖర్, సుజాత, మహ్మద్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కొడిమ్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదిక, మండలంలోని పూడూర్, తిర్మలాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు డిజిటల్ అగ్రికల్చరల్, తెలంగాణాలో డ్రాగన్ ఫ్రూట్స్, వాటి నిర్వహణ పద్ధతులపై రైతులకు అవగాహన కలిపించారు. రైతు నేస్తం కార్యక్రమాలలో ఆయా గ్రామాల ఏఈవోలు, పూడూర్ మాజీ సర్పంచు వి. రాంరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్షయ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి


పౌష్టికాహారం అందిస్తున్న వైద్యులు

కోరుట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్షయ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకొని అక్కడ అందించే మందులను వాడాలని ఆయన అన్నారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ అసుపత్రిలో నిర్వహిస్తున్న నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇమ్యూనేషన్ అధికారి ఆకుల శ్రీనివాస్, ఐఎంఏ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, కోరుట్ల ఐఎంఏ అధ్యక్షుడు రేగోండ రాజేష్‌లతో కలిసి వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారంను అందించారు. ఈ సందర్భంగా వారు వ్యాధిగ్రస్తులు తీసుకో వాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినోద్, లక్ష్మి, డిపిఓ తులసి, రవీందర్, సీసీ కుతుబోద్దిన్, సూపర్‌వైజర్లు మంకిడి శ్రీనివాస్, డిపిపిఎం హరీష్, మల్లికార్జున్, టిబి ల్యాబ్ సూపర్‌వైజర్లు రియాజ్ పార్మసీ అఫీసర్ ఉదయ్ ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత ఆరోగ్య శిబిరం

మల్యాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మల్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో బుధవారం, గురువారాల్లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యురాలు మౌనిక తెలిపారు. బుధవారం చిన్నపిల్లలకు ఆరోగ్య పరీక్షలు, పోషకాహార సలహాలు, టీకాలు, జనరల్ వైద్య సేవలు, జ్వరాలు, శ్వాస సంబంధిత సమ్యలు, సాధరణ చికిత్సలు, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు, టీబీ, మధుమేహం తదితర పరీక్షలు నిర్వహించడం జరుగు తుందన్నారు. అలాగే గురువారం దంత పరీక్షలు, జనరల్ వైద్య సేవలు, బీపీ, షుగర్ తదితర వాటికి నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు కోరారు.

కల్వర్టులను త్వరితగతిన మరమ్మతు చేయాలి

రాయికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులను త్వరితగతిన మరమ్మతు చేయాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న ఇటిక్యాల రోడ్డు ఎగ్గల్ చెరువు కల్వర్టును, పశువుల బాటను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి మరమ్మతు పనులు చేయా లని సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

బీర్‌పూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో మంగళవారం బీజేపీ నాయకులు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో నర్సింహులపల్లి గ్రామానికి రెండు హైమాస్ లైట్లను ఏర్పాటు చేయడం కోసం ఎంపీ కోట నుండి నిధుల కేటాయించారు. నర్సింహులపల్లి గ్రామంలోని మండలేశ్వర స్వామి ఆలయం వద్ద ఒక్కటి, నర్సింహులపల్లి పెద్దవాడలో ఒక్క హైమాస్ లైట్ ఏర్పాటు చేయగా బీజేపీ నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, నాయకులు మామిడిపెల్లి లింగన్న, నారపాక అశోక్, బండారి రవి, కందుకూరి లక్ష్మన్, గోస్కుల రాకేష్, వరుణ్, మల్లేశం, వసంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సెర్ప్ ఐబీ డైరెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. మహిళా సంఘాల వారు ఎంటర్ పెన్యూర్‌పై దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీలోని శిల్పారామంలో జరుగుతున్న జాతీయస్థాయి వివిధ మహిళా సంఘాల ఉత్పత్తుల మేళా సందర్శనకు జగిత్యాల జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో మహిళలు ఉత్పత్తి చేస్తున్న ప్రదర్శన మరియు అమ్మకాల పరిశీలనకు జగిత్యాల జిల్లా లోని మహిళా సమాఖ్య మరియు మండల సమాఖ్య సభ్యులు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నవీన్ కుమార్ మాట్లాడుతూ మహి ళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు మండల సమాఖ్యలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు అక్కడ ప్రదర్శనలో మహిళా సంఘాల వారు చేస్తున్న ఉత్పత్తులను, అమ్మకాలను, మార్కెటింగ్, తీసుకున్నలోన్, శిక్షణలు నాణ్యత ప్రమాణాల అంశాలను పరిశీలించారు. ఉత్పత్తి చేసిన వస్తువులకు ప్యాకింగ్, మార్కెటింగ్ సౌకర్యం అనే విషయాలను సెర్ప్ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్లు బీమయ్య, భారతి, డీపీఎంలు కరుణాకర్, స్వర్ణలత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జగిత్యాల డీఆర్‌డీవో పీడీ రఘువరణ్ డీపీఎం రమేష్, ఏపీఎం గంగాధర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి ఆమని పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

ఇట్లు సం/- తునికి శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్
ఇ.నెం. 2-10-119,
హనుమాన్ సంతోషిమాత గుడి దగ్గర, జ్యోతినగర్,
కరీంనగర్, సెల్ : 9440070078

శరన్నవరాత్రోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానం

కోరుట్ల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని వివిధ కుల సంఘాలతో పాటు వేంకటేశ్వర దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుకు మంగళవారం ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎతిరాజం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

8లో

తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి


బతుకమ్మ ఆడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బస్టాండు చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ నేతృత్వంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి తదితర భాగస్వామ్యమై మహిళలతో కలిసి పదం పాదం కలిపారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డితో పలువురు వక్తలు మాట్లాడారు. బతుకును ఇచ్చే అమ్మ బతుకమ్మ అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో బతుకమ్మ పండుగను ఎంతో గొప్పగా జరుపుకునేదని, ప్రస్తుతం చీకట్లో ఆడే పరిస్థితి చోటు చేసుకుందన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను, చరిత్ర తొలగించడానికి సీఎం రేవంత్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జగిత్యాల జిల్లా పూడూర్ తన అమ్మమ్మ ఇల్లు అని వెల్లడించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు బతుకమ్మ ఆడాలా.. యూరియా కోసం లైన్‌లో నిలబడాలా అనే అయోమయ పరిస్థితి నెలకొందని ఆమె ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు మార్చే రోజు వస్తుందని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో మారోమారు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కాంగ్రెస్ తల్లి విగ్రహాలను గాంధీభవన్ పంపుతామని హెచ్చరించారు. కాగా రంగు రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వచ్చి మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. పాటలు పాడారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సారథి పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్



సారథి పోర్టల్ ద్వారా లెర్నింగ్ లైసెన్సును అందజేస్తున్న ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఎంవీఐ రవికుమార్

తిమ్మాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన సారథి పోర్టల్ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో సారధిపోర్టల్ ద్వారా మొట్టమొదటి సారి పొందిన లెర్నింగ్ లైసెన్స్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెర్నింగ్, పర్మినెంట్, ఇతర లైసెన్సులకు సంబంధించి సారధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. లైసెన్సుదారుడు ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉండి, ఉద్యోగరీత్యా ఇతర కారణాల దృష్ట్యా తెలంగాణ రాష్టానికి వచ్చినప్పుడు ఆ వ్యక్తి డైరెక్ట్‌గా సారధి పోర్టల్ ద్వారా చిరునామా మార్పు గురించి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని సేవలను పొందవచ్చని తెలిపారు. సారధి పోర్టల్‌తో ఎటువంటి ఎన్‌వోసీ తీసుకురావాల్సిన అవసరం లేకుండానే సేవలను వినియోగించు కోవచ్చు అని తెలిపారు. తిమ్మాపూర్‌లోని జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో సారధిపోర్టల్‌సేవలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఆర్టీఏ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లను అందజేసిన ఎస్సై

రామడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో ఇద్దరు యువకులు పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని కనుక్కొని తిరిగి బాధితులకు అందజేశారు. రామడుగు ఎస్ఐ కె రాజు కథనం ప్రకారం.. రామడుగు గ్రామానికి చెందిన రాగం సాయి(22) అనేరైతు తన మొబైల్ ఫోన్‌ను ఇటీవల రామడుగులో పోగొట్టుకున్నాడు. అలాగే రామడుగు గ్రామానికి చెందిన ఎలగందుల రామకృష్ణ వెదిర నుంచి రామడుగు వచ్చేటప్పుడు తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వీరిద్దరూ రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రాజు సీఇఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను ట్రేస్‌చేసి కనుక్కొనికి వారికి అందజేశారు.

గంజాయి దహనం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు పోలీసు స్టేషన్లలో నమోదైన 45కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 14.945కిలోల గంజాయిని ఎన్డీపీఎస్ చట్టప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ ఎన్డీపీఎస్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన గంజాయిని దహనం చేశామన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థవంతంగా నిరోధిస్తున్నారన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, డీసీఆర్బి సీఐ నాగేశ్వర్‌రావు, ఆర్ఎస్ఐ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

జనరేటర్ దగ్ధం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని కేబుల్‌బ్రిడ్జి బటర్‌ఫ్లై చౌరస్తాలో మంగళవారం అగ్నిప్రమాదంలో జనరేటర్ దగ్ధమైంది. మరమ్మతు కోసం శంకరపట్నం నుంచి కరీంనగర్‌కు డీజిల్ జనరేటర్‌ను ఆటోలో తీసుకొస్తున్నారు. బటర్‌ఫ్లై చౌరస్తా వద్దకు రాగానే జనరేటర్‌లో మంటలు లేచి అంటుకున్నాయి. వెంటనే పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే జనరేటర్, ఆటోకు కొంతవరకు మంటలు అంటుకోవడంతో నష్టం వాటిల్లింది. జనరేటర్ బ్యాటరీ వైర్లు తొలగించకపోవడంతో మంటలు అంటుకున్నట్లు భావిస్తు న్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

రామగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్, వకీల్‌పల్లే ప్లాట్‌లలో అక్రమంగా నాటు సారాయి అమ్ముతూ పట్టుబడిన పుల్లి రమేశ్, లావుడియా మౌనిక, గుగులోతు స్వామి, అనే ముగ్గురిని ఎక్సైజ్ శాఖ అదికారులు మంగళవారం తహసీల్దార్ సుమన్ ఎదుట బైండోవర్ చేశారు. రూ. లక్ష పూచికత్తులతో వీరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

గొర్రెల దొంగలు పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో జనగామ పోలీసులు గొర్రెల దొంగతనం చేసిన వారిని పట్టుకున్నారు. కేశవపట్నంకు చెందిన కొందరు వ్యక్తులు జనగామలో ఓ గ్రామంలో పది గొర్రెలను దొంగతనం చేసి ఆటోలో తరలి స్తుండగా జనగామ పోలీసులు వెంబడించి మొలంగూర్ శివారులో పట్టుకున్నారు. దొంగలతో పాటు గొర్రెలను జనగామ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారులోని నవదుర్గ ఆలయ సమీపంలోని వ్యవసాయబావిలో మంగళవారం గుర్తుతెలియని 40 సంవత్సరాలు గల యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మృతుడి కుడి చేతిపైన ఎస్.హన్మంతరావు అని రాసి ఉందని తెలిపారు. మృతుడి శరీరంపైన గోధుమరంగు చొక్కా, నేవీ బ్లూకలర్ ప్యాంటు ఉందన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వ్యక్తులు జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ సెల్‌నంబర్ 8712656822, కానిస్టేబుల్ మోహన్ సెల్‌నంబర్ 8712657800లో సంప్రదించాలని కోరారు.

సెంట్రల్ కమిటీ బాధ్యతలు చేపట్టిన వారంలోనే..

● పూర్తికాని కోస మృతదేహం పోస్టుమార్టం ● ఛత్తీస్‌గఢ్‌కు తరలివెళ్లిన బంధువులు ● గోపాల్‌రావుపల్లిలోనే అంత్యక్రియలు

సిరిసిల్ల క్రైం/కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస, గోపన్న, సాధు మావోయిస్టు కేంద్రకమిటీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన వారం రోజులకే ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజుడ్‌మాన్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డిలు మృతిచెందారు. కడారి సత్యనారాయణరెడ్డి మృతదేహాన్ని నారాయణపూర్ జిల్లా ఆసుపత్రి మార్చరీలో భద్రపర్చారు. మృతదేహాలకు మంగళవారం రాత్రి వరకు పోస్టుమార్టం పూర్తికాలేదు. మృతదేహంను కుటుంబ సభ్యులు గుర్తుపట్టి సత్యనారాయణరెడ్డిదేనని తేల్చాక బుధవారం పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉంది. మృతదేహాన్ని తీసుకవచ్చేందుకు సిరిసిల్ల నుంచి కడారి సత్యనారాయణరెడ్డి అన్న కరుణాకర్‌రెడ్డి, సమీప బంధువులు నలుగురు నారాయణపూర్‌కు బయలుదేరారు. వీరు మంగళవారం రాత్రి చేరుకున్నారు. వీరి సమక్షంలోనే పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించే అవకాశం ఉంది. సత్యనారాయణరెడ్డి విప్లవబాట పట్టిన 45సంవత్సరాల తర్వాత మృతదేహాన్ని స్వగ్రామమైన గోపాల్‌రావుపల్లికి తీసుకువస్తుండటంతో ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికేందుకు ఎదురుచూస్తున్నారు. బుధవారం ఏ రాత్రి అయినా గోపాల్‌రావుపల్లిలో అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కోసా ఇల్లు



గోపాల్‌రావుపల్లె గ్రామం

● రెండుసార్లు జైలుకు వెళ్లి అజ్ఞాతంలోకి..

కడారి సత్యనారాయణరెడ్డి 1980లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పటికే సిమెంటు కర్మాగారంలో ఉద్యోగం చేస్తూ ఆ కంపెనీ మేనేజర్ హత్యకేసులో జైలుకు వెళ్లి వచ్చి అజ్ఞాతం బాట పట్టాడు. మళ్లీ 1996లో వరంగల్‌లో అరెస్టు అయి జైలుకు వెళ్లి మూడు నెలలకు బెయిల్‌పై వచ్చి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు.

● చివరిసారి 45 ఏళ్ల క్రితం

ఉగాది పండుగరోజు చూశా..

- సత్యనారాయణరెడ్డి సోదరుడు కరుణాకర్‌రెడ్డి

1980 ఉగాదిన గోపాల్‌రావుపల్లిలో ఇద్దరం కలిసి కుటుంబ సభ్యులతో పండుగ చేసుకున్నట్లు కడారి సత్యనారాయణరెడ్డి సోదరుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మరుసటి రోజున కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగానికి సత్యనారాయణరెడ్డి వెళ్లిపోయాడు. నెల రోజులకు మా ఇంటికి పోలీసులు వచ్చి మీ తమ్ముడు ఒక హత్య కేసులో యూజీ(అండర్‌గ్రౌండ్)లోకి పోయాడని చెప్పారు. అప్పటి నుంచి నేటి వరకు మా తమ్ముడి గురించి ఎటువంటి సమాచారం లేదు. నేను కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో తను ఇక్కడే మంకమ్మ తోటలో అద్దెగదిలో నాతో కలిసి ఉంటూ మల్టీపర్పస్ స్కూల్‌లో ఇంటర్ చదువుకున్నాడు. తమ్ముడు చాలా భయస్తుడుగా ఉండేవాడు. చదువుకునే సమయంలో తాను వెంట ఉంటేనే బయటకు వెళ్లేవాడు. సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వార్తలను చూడటం తప్ప ఏమీ తెలియదు. 6 నెలలకు ఒకసారి పోలీసులు వచ్చి కడారి సత్యనారాయణరెడ్డి బాగానే ఉన్నాడని, ఇంటికి వస్తే సమాచారం తెలపాలని కోరుతుండేవారని తెలిపారు.



రామచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి(ఫైల్)

ఇద్దరి ప్రస్థానం పెద్దపల్లి నుంచే..

పెద్దపల్లి కల్చరల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కడారి సత్యనారాయణరెడ్డి, కాతా రామచంద్రారెడ్డి మృతి చెందారు. వీరిద్దరి ఉద్యమ ప్రస్థానం పెద్దపల్లి జిల్లా నుంచే మొదలైంది. కడారి సత్యనారాయణరెడ్డి 1978 ప్రాంతంలో పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో టెక్నీషియన్‌గా ట్రైనింగ్‌పొంది బసంత్‌నగర్ కేశోరాంసిమెంట్ ఫ్యాక్టరీలో అప్రెంటీస్‌షిప్ చేస్తుండగా ఒకవర్గంతో ఘర్షణ పడి ఉద్యమంలోకి వెళ్లాడు. కాతా రామచంద్రారెడ్డి (66) అలియాస్ కట్టారామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా అలియాస్ విజయ్ అలియాస్ వికల్ప్‌ది హుస్నాబాద్ ప్రాంతం. జిల్లాలోని పెంచికల్‌పేటలో ఎస్జీటీ టీచర్‌గా పనిచేశారు. టీచర్‌యూనియన్‌లో క్రియాశీలక కార్యకర్తగా విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రైవేటు ఉపాధ్యాయుల వేతన స్థిరీకరణకు పోరాడారు. అనంతరం నాందేడ్‌లో లా చదువుతూనే ఉద్యమం వైపు అడుగులు వేశాడు.

అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్

● సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసు

హుజూరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని వైన్‌షాపు పక్కన ఉన్న పర్మిట్ రూమ్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు ప్రత్యక్షంపై రంగాపూర్ అంగన్‌వాడీ టీచర్ రాజమ్మను విధుల నుంచి తొలగిస్తూ జిల్లాకలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగురోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని పర్మిట్‌రూమ్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు ఉండడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై డీడబ్ల్యూవో సరస్వతి, ఎక్సైజ్ ఎస్ఐ వినోద్, సీడీపీవో సుగుణ విచారణ జరిపారు. ఈ కోడిగుడ్లురంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1 నుంచే తీసుకువచ్చారని నిర్ధారణకు వచ్చి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించిన అంగన్‌వాడీటీచర్ రాజమ్మను విధుల నుంచి తొలగించడంతో పాటు సూపర్‌వైజర్ శిరీషకు షోకాజ్ నోటీసులు, సీడీపీవో సుగుణకు మెమో జారీచేశారు.

భార్యను కులం పేరుతో దూషించిన భర్తకి ఏడాది జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భార్యను కులం పేరుతో దూషించి, రూ.5లక్షలు కట్నం తేవాలంటూ వేధించిన కేసులో నిందితుడు కూర అంజిరెడ్డికి ఏడాదిజైలు శిక్ష పడిందని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన నిర్మలను 2017లో చెర్లబూత్కూర్‌కు చెందిన కూర అంజిరెడ్డి వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కొడుకు ఉన్నాడు. భార్య నిర్మలను కులం పేరుతో దూషించి, రూ.5లక్షల కట్నం తేవాలంటూ డిమాండ్ చేయగా కరీంనగర్‌రూరల్ ఠాణాలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు చెప్పారు. ఈ కేసులో కరీంనగర్ కోర్ట్ సోమవారం నిందితుడికి ఏడాది జైలుశిక్ష, వెయ్యిరూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనల్లో ప్రజల భాగస్వామ్యం

- ఉల్లంఘనలకు సంబంధించి ఫొటోలతో వాట్సప్‌కు ఫిర్యాదు చేయాలి
- కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ రోజు రోజుకు పెరిగిపోటవంతో వాహనదారులతో పాటు, పాదచారులకు కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తు తున్నాయి. రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించటంతో పాటు, అడ్డదిడ్డంగా రోడ్డుపై వాహనాల పార్కింగ్, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం వంటి ఉల్లంఘనలతో పాదచారులు రోడ్లపై నడవా లంటే భయాందోళనలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిలో రోడ్డుపై వెళ్లే వాహనాలు ఢీకొని పాదచారులు, రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలతో ఇతరులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలపై ట్రాఫిక్ పోలీసులతో పాటుగా ప్రజలు ఎక్కడికక్కడ వాహన దారుల ఫొటోలు తీసి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నెంబరుకు షేర్ చేసే విధంగా కరీంనగర్ పోలీసులు నూతనంగా ప్రజల భాగస్వామ్యంతో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. ట్రాఫిక్ నిబంధనలును పటిష్ఠంగా అమలుచేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఒక కొత్త కార్యక్రమం ద్వారా వాట్సప్ నెంబర్ 9381919112ను ప్రవేశపెట్టారు. కమిష నరేట్ వ్యాప్తంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారుల ఫొటోలను వాట్సప్‌కు పంపిస్తే ఆ వాహనదారులకు జరిమానా విధిస్తామని పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం, త్రిబుల్ రైడింగ్, రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలను పార్క్ చేయటం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాల ఫొటోలను ప్రజలు నేరుగా తమ టైమ్‌స్టాంప్ కెమెరాతో ఫొటోలు తీసి వాట్సప్ నెంబరుకు పంపించవచ్చు. కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్‌ను మరింత సురక్షితంగా, క్రమబద్ధంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ట్రాఫిక్ పోలీసు లు చెబుతున్నారు. ప్రజలందరూ ఈ నూతన కార్యక్రమానికి సహకరించి, సురక్షిత ప్రయాణానికి తోడ్పడాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.





భూ వివాదమే ప్రాణం తీసింది..

● పథకం ప్రకారమే రియల్టర్ రమేష్ హత్య
● ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరొకరు..
● వెల్లడించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంతోపాటు పెట్రోల్‌బంక్‌లో భాగస్వామ్యం ఇస్తానని మోసం చేయడం రియల్టర్ ప్రాణం తీసింది.. ఇందుకు ఇద్దరికి సుపారీ ఇచ్చి రమేష్ హత్యకు భాగస్వామి వ్యూహం పన్నాడు. పథకం ప్రకారం రమేష్‌ను పిలిచి హత్య చేశారు. ఈకేసులో ఇద్దరిని అరెస్ట్‌చేయగా, మరొకరు పరారీలో ఉన్నారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల మాజీ కౌన్సిలర్, రియల్టర్ సిరిగిరి రమేష్‌కు చందుర్తిలోగల భూమిని ఎస్సీ కార్పొరేషన్ లోన్‌పై పెట్రోల్ బంక్ కోసం చిర్రం రవి రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే పెట్రోల్ బంక్ ఇవ్వక పోవడమే కాకుండా తిరిగి ఆ భూమిని రవికి రిజిస్ట్రేషన్ చేయలేదు. తన భూమి తనకు దక్కాలంటే సిరిగిరి రమేష్‌ను అంతం చెయ్యాలని చిర్రం రవి నిర్ణయించుకున్నాడు. ఇందుకు వేములవాడకు చెందిన ఎద్దండి వెంకటేష్, అలా వంశీలకు సుపారీ ఇచ్చి హత్యకు వ్యూహం రూపొందించారు. పథకం ప్రకారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు సబ్‌స్టేషన్ సమీపంలో రమేష్‌ను కత్తితో పొడిచి హత్యచేశారు. రమేష్ చనిపోయాడని నిర్ధారించుకొని శవాన్ని ఎద్దండి వెంకటేష్ కారులో తీసుకువచ్చి వేములవాడలోని నంది కమాన్ సమీపంలోగల రమేష్‌కు చెందిన నందీశ్వర టౌన్‌షిప్ వెంచర్‌లో వదిలిపెట్టి పారిపోయారు. పోలీసులు తమ గురించి వెతుకుతారనే భయంతో పారి పోతుండగా వేములవాడలోని సాయిరక్షా దాబా సమీపంలో నిందితులైన ఏద్దండి వెంకటేష్, అలా వంశీలను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆమె తెలిపారు. వీరివద్ద ఇన్నోవా కారు, మొబైల్ ఫోన్, కత్తిని సీజ్ చేశామన్నారు. మరొకరు చిర్రం రవి పరారీలో ఉన్నాడని ఆమె తెలిపారు.

ఇసుక వేలం



ఇసుకను వేలం పాడుతున్న రెవెన్యూ అధికారులు

పాలకుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్ నగర్ పోలీసులు గత నెలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఇసుకను మంగళవారం ఆర్ఐ ఎన్ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ మల్కారెడ్డి బసంత్‌నగర్ పోలీస్టేషన్ ఆవరణలో బహిరంగా వేలం పాట నిర్వహించారు. వేలలో ముగ్గురుపాల్గొనగా అత్యధికంగా రూ.30వేలుపాడిన పూజారి చంద్రశేఖర్ ఇసుకను దక్కించుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. ఈ వేలం పాటలో రెవెన్యూ సిబ్బంది లక్ష్మీనారాయణ, కాసార్ల తిరుపతి పాల్గొన్నారు.

26న ఇసుక వేలం

గన్నేరువరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద నుంచి ఈనెల 4న పట్టుకున్న రెండు లారీల్లో ఇసుకకు ఈనెల 26న రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దారు నరేందర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ఐదు వేలను చెల్లించాలని తెలిపారు.

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి



దుర్గయ్య(ఫైల్)

తిమ్మాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరండ్ల గ్రామపంచాయితీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న కిన్నెర దుర్గయ్య(62) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం దుర్గయ్య గ్రామంలో పారిశుధ్య పనులు చేసి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో సేద తిరుతుండగా ఒక్కసారి గుండెల్లో నొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీని పిలిపించారు. అయితే అప్పటికే దుర్గయ్యా గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు దుర్గయ్యకు భార్య ముగ్గురుసంతానం ఉన్నారు. దుర్గయ్యపైనే కుటుంబంఅంత జీవిస్తుండగా, అతడు మృతి చెందడంతో కుటుంబం ఇంటి పెద్దను కోల్పోయి, కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం దుర్గయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల పట్టివేత

మల్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తాటిపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న తొమ్మది మందిని పట్టుకొని వారి వద్ద రూ.27070 నగదుస్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విత్తన ధాన్యం డబ్బులు రాక రైతుల గోస

● పండగపూట ఆందోళనలో అన్నదాతలు
● మూడు నెలలైనా అందని డబ్బులు
● ముఖం చాటేస్తున్న ఆర్గనైజర్లు
● పట్టించుకోని అధికారులు



విత్తన వరిలో బెరికి మొక్కలను తొలగిస్తున్న మహిళా రైతులు, కూలీలు(ఫైల్)

వీణవంక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీడ్ ధాన్యం డబ్బులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పండగపూట చేతిలో చిల్లిగవ్వ లేక పండించిన పంటకు డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీణవంక మండలంలోని 26గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ దాదాపు 18వేల ఎకరాలలో ఆడ మగ సీడ్ వరిని రైతులు పండించారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. బ్రహ్మణపల్లి, బేతిగల్, రెడ్డిపల్లి, వీణవంక, నర్సింగాపూర్, కనపర్తి, ఎల్బాక, గంగారం, మామిడాలపల్లి, లస్మక్కపల్లి, కొర్కల్, మాల్లారెడ్డిపల్లి, చల్లూరుతో పాటు గ్రామాల్లో రైతులు సీడ్‌వరి పండించారు. సీడ్‌రైతులకు దాదాపు 25కోట్ల రుపాయల వరకు రావాల్సిఉన్నది. డబ్బులు చెల్లించకుండా సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్‌లు ముఖం చాటేసారు. ఎవరికి చెప్పాలో తెలియక రైతులు గ్రామాల్లోని ఆర్గనైజర్‌ల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. వర్షాకాలం పంట పెట్టుబడికి అందుతాయని సీడు వరి పండిస్తే పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతులకు డబ్బులు రాక పంట పెట్టుబడికి అప్పులు చేస్తున్నారు. ఆర్గనైజర్‌ల ఇళ్ల చుట్టూ తిరిగితే రూ.10వేలు ఇచ్చి కంపెనీ ఇస్తే ఇస్తామని చెపుతున్నారు.

● అమలు కాని ఒప్పందం..

పంట నష్టపోయినా, దిగుబడి రాకున్నా సీడ్ కంపెనీ చెప్పిన ప్రకారం దిగుబడి రాకున్నా సీడ్ కంపెనీ డబ్బులు ఇస్తుందని చెప్పి సీడ్ ఆర్గనైజర్‌లు రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. తమ సీడ్ పండించాలంటూ రైతులను మభ్యపెడుతున్నారు. ఒప్పందం ప్రకారం బాండ్ పేపర్ ఇచ్చినా అనుకున్న ప్రకారం ఆర్గనైజర్‌లు డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఏమీ చేయలేక పోతున్నారు. కొంతమంది ఆర్గనైజర్‌లు రైతుల నుంచి ధాన్యం సేకరించి సీడ్ కంపెనీకి పంపించ కుండా ప్రైవేటుగా విక్రయిస్తున్నారు. డబ్బులు చెల్లిం చాలని రైతులు అడిగితే మొండిచేయి చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి యేటా నష్ట పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని సీడ్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పటిష్ఠమైన నిబం.ధనలు రూపొందించాలని రైతులు కోరుతున్నారు. రైతులకు సీడ్ డబ్బులు కంపెనీలు చెల్లించడం లేదని మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా కొంత మంది రైతులకు కొన్ని కంపెనీలు చెల్లించ లేదని రైతులు చెపుతున్నార న్నారు. కానీ ఎవరూ నేరుగా ఫిర్యాదు చేయడం లేదని తెలిపారు. నష్టపో యిన రైతులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డబ్బులు అందేలా చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్య



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు

భగత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యమవుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు అన్నారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల గోడు పట్టించుకునే నాథుడు లేడన్నారు. రాష్ట్రంలో కనీసం విద్యాశాఖకు మంత్రి లేకపోవడం బాధకరమన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్ఎఫ్ఐ ఉందన్నారు. విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న ఘనత ఎస్ఎఫ్ఐదే అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరంలో ఐటీఐలో ప్రవేశాలు చేపట్టకుండా నిలిపి వేశారన్నారు. ప్రభుత్వం సంప్రదాయ ట్రేడ్లలో అడ్మిషన్లు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, సహాయ కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, కిరణ్, ప్రశాంత్, కాంపెల్లి అరవింద్, రాష్ట్ర కమిటీ నాయకులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు తాగి డ్యాన్స్ మాస్టర్ మృతి



శేఖర్(ఫైల్)

రామడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావు పేట గ్రామానికి చెందిన దాసరి శేఖర్ అనే డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. శేఖర్ గ్రామంలో ఓ ప్రైవేట్ స్కూల్ డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం గడ్డిమందు తాగి పడిపోగా వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతికిగల కారణాలు ఇంకా తెలియరాలేదు. గ్రామంలో మంచిపేరు ఉన్న యువకుడు అకారణంగా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఆడుతున్న మహిళలపై రాళ్లు రువ్విన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్ ప్రైమరీ స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల21నరాత్రి 9 గంటలకు స్థానిక మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. అదే కాలనీకి చెందిన షేక్ సజ్జు రాళ్లను విసరగా అక్కడఉన్న కాసారపు లక్ష్మి, మధురెడ్డి ఎల్లమ్మ, మొగిలి ఆకిరానందుకు గాయాలయ్యాయి. ఘటనపై కాసారపు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు, షేక్ సజ్జును అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

సమ సమాజం.. జనహితం

- సామాజిక మార్పు దిశగా విద్యార్థులు
- నేడు ఎన్ఎస్ఎస్ దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తి వ్యక్తికోసం కాదు సమాజ నిర్మాణం కోసం దోహద పడాలనే పూజ్య బాపూజీ ఆశయం మేరకు 1969 సెప్టెంబర్ 24న అప్పటి విద్యా శాఖ మంత్రి వికెఆర్‌వి రావు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను ప్రారంభించారు. సమాజ శ్రేయస్సు కోసం అంకిత భావంతో కృషిచేసే యువతను తయారు చేసేందుకు ప్రయోగాత్మకతంగా దేశంలోని 37 విశ్వ విద్యాలయాలలో 40 వేల మంది వలంటీర్లతో ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 440 యూనివర్సిటీలలో 4 లక్షల 20 వేల వలంటీర్లతో, శాతవాహన విశ్వ విద్యాలయ పరిధిలో 135 యూనిట్లతో సుమారు 15,000 మంది వలంటీర్లతో ఎన్ఎస్ఎస్ ఒక శక్తివంతమైన వారధిగా తయారైంది. విద్యార్థులు సామాజిక బాధ్యతను విస్మరించకుండా సమాజంలో ఉన్న అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసే విధంగా వలంటీర్లను జాతీయ సేవా పథకం తీర్చిదిద్దుతుంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, యువజన సర్వీసులు, క్రీడా శాఖల సంయుక్త నిర్వహణలో ఎన్ఎస్ఎస్ ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. విద్యార్థుల్లో సేవాభావాన్ని, నాయకత్వ లక్షణాలను మెరుగు పరుస్తూ జాతికి అమూల్యమైన మానవ వనరులను అందిస్తున్న ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24న నిర్వహించుకుంటున్నాం.

● ఎన్ఎస్ఎస్ లోగో...



ఒరిస్సా రాష్ట్రంలో కోణార్క్ సూర్య దేవాలయంలోని రథ చక్రాన్ని ఎన్ఎస్ఎస్ లోగోగా (చిహ్నం) గా తీసుకున్నారు. చక్రం అనేది ప్రగతికి, మార్పుకు చిహ్నం. ఈ చక్రంలో ఎరుపు రంగు యువత స్వచ్ఛమైన రక్తంతో ఆరోగ్యంగా ఉన్నారని, నీలి రంగు విశాల విశ్వంలో నేను సైతం సమాజ చైతన్యానికి కృషి చేస్తాననే సంకేతాన్ని ఇస్తుంది. ఈ చక్రంలో 8 పుల్లలు కలవు. అవసరమైతే 24 గంటలు సమాజ సేవకు సిద్ధమని సంకేతం.

● ఎన్ఎస్ఎస్ నినాదం..

నాట్ మీ - బట్ యూ అనే నినాదంతో ప్రారంభం అవుతుంది. 'నా కోసం కాదు మీ కోసం' అనగా నేను సామాజిక మార్పుకు సిద్ధంగా ఉన్నానని అర్థం.

● విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వం, విలువలపట్ల అవగాహన కల్పించడానికి ఎన్ఎస్ఎస్ వివిధ కార్యక్రమాలు చేపడుతుంది. శ్రమదానం మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు తోడ్పాడు అందిస్తుంది. ఉత్తమ సమాజం, ఆదర్శ సమాజ నిర్మాణంలో విద్యార్థులు పాలు పంచుకునేలా చేస్తూ సమాజ సేవతో తమ అనుభవాన్ని పెంచుకునేలా ఎన్ఎస్ఎస్ దోహదపడుతుంది. ఒక్కప్పుడు శ్రమదాన కార్యక్రమాలకు ఎన్ఎస్ఎస్‌లో ప్రాధాన్యం ఉండగా నేడు విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ యువతలోని సృజనాత్మకతను వెలుగులోకి తెస్తున్నారు.

● ఎన్ఎస్ఎస్‌లో అవార్డు గ్రహీతలు

పూర్వ లైజన్ అధికారి డాక్టర్ ఎం శంకరయ్య, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంగోజు మనోహరాచారి, ఆర్ గోపికృష్ణ, డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, డాక్టర్ ఎండి ఆలీఖాన్, వలంటీర్లు చుక్క శ్రీనివాస్, అవంతి, బోడి ఆంజనేయులు, టి నవీన్, కె చంద్రశేఖర్, నక్క అనితలు ఎన్ఎస్ఎస్‌లో సత్తాచాటి జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ అవార్డులను సొంతం చేసుకున్నారు.

● ఎస్ఆర్ఆర్ కళాశాలలో

ఉత్తర తెలంగాణలో అతి పెద్దదైన శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 1975లో వంద మంది వలంటీర్లచే ఎన్ఎస్ఎస్ ప్రారంభమైంది. ప్రస్తుతం 5 యూనిట్లు, ఐదుగురు ఎన్ఎస్ఎస్ అధికారులు, 5 వందల మంది వలంటీర్లచే ప్రభుత్వ ఆశయాలను అక్షరాల ఆచరణలో చూపుతూ నాటి నుంచి నేటి వరకు ఎన్నో సామా జిక కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల ఎన్ఎస్ ఎస్ వలంటీర్లు నాలుగు ఎకరాల స్థలాన్ని పూల వనంగా మార్చడంతో పాటు చెక్ డ్యాంల నిర్మాణం, హరితహారం కార్యక్రమం, ఓటరు అవగాహన ర్యా లీలు, రక్తదాన శిబిరంలలో పాల్గొంటూ కళాశాల వైభవాన్ని రాష్ట్ర, జాతీయస్థాయిలో చాటుతున్నారు.



బతుకమ్మలతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు

ఎన్ఎస్ఎస్‌తో సామాజిక స్పృహ పెరుగుతుంది

- డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్



ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ, దేశభక్తి పెరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంది. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు ఎన్ఎస్ఎస్ చక్కని వేదికగా ఉపయోగ పడడమే కాక భవిష్యత్తులో ఏ రంగంలోనైనా స్థిర పడేందుకు కావాల్సిన నైపుణ్యాన్ని ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది.

సామాజిక స్పృహ సేవాభావం పెంపొందుతాయి

-పడాల తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి



నేను గత 5సంవత్సరాలుగా ఎన్ఎస్ఎస్ పీవోగా సేవలు అందిస్తున్నాను. ఎన్ఎస్ఎస్‌తో యువతలో సామాజిక స్పృహ సేవాభావం, సోదరభావం, సమైక్యత భావం పెంపొందుతాయి. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో సామాజిక అవగాహన పెరుగుతుంది. నాయకత్వ లక్షణాలు సంభాషణా నైపుణ్యాలు పెంపొందుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తోడ్పడుతారు.

సమాజ నిర్మాణంలో భాగస్వామిని అవుతా..

- బొజ్జ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ వలంటీర్



నేను ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ఇంత వరకు శ్రమదానం, హరితహారం, ట్రాఫిక్ నియంత్రణ తదితర సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఒక ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా సమాజ సేవ చేయడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం సమాజంలో కనుమరుగవుతున్న నైతిక విలువల ఆవశ్యకతను తెలుసుకున్నాను. మున్ముందు వివిధ గ్రామాల్లో పర్యటించి అసాంఘిక శక్తుల పట్ల గ్రామీణులను ఉత్తేజపరుస్తాను. దేశ సేవ పరమావధిగా ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటున్నాం.

బ్రహ్మచారిణి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు





వేములవాడలో, ధర్మపురిలో బ్రహ్మచారిణి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కొండగట్టులో గాయత్రిదేవిగా అమ్మవారు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం దుర్గామాత అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా రాజన్న ఆలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయఅర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్నఆలయంలో జరుగుతున్న అభివృద్ధిపనుల్లో భాగంగా మంగళవారం ఆలయంలోని ప్రధానకార్యలయాలను శ్రీభీమేశ్వర సదన్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి భీమేశ్వర సదన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు.

ధర్మపురి: ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయవేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. దుర్గాదేవి బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. శ్రీ యోగ, ఉగ్ర నరసింహస్వామి వారల సేవలను ఐరావత వాహనంపై పురవీధుల గుండా ఊరేగింపు జరిపారు. టీటీడీ కళ్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహాశక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో, నేరెళ్లలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అనంత దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కొండగట్టులో గాయత్రిదేవిగా..

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల

● 40 గేట్ల ద్వారా 2,38,720 క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 40గేట్లు పైకి ఎత్తి 2,38, 720క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరునిల్వ ఉంది. వరదకాలువకు 6,735క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోత పథకానికి 180క్యూసెక్కులు విడుదల అవుతోంది.

'అన్నపూర్ణ'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.25టీఎంసీల నీరు ఉంది. మధ్య మానేరు ద్వారా వస్తున్న 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి(మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు మంగళవారం 9800క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా 4500 మానేరు, మూలవాగుద్వారా 5300క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 5000 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200క్యూసెక్కులనీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 318.89ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు 38 గేట్ల ద్వారా నీటి విడుదల

అంతర్గాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం ప్రాజెక్టు నుండి 5273 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుండి 2.38 లక్షల క్యూసెక్కులు, వాగులు, వంకల నుండి 1.86 లక్షల క్యూసెక్కులు మొత్తం 4.3 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో మంగళవారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 38గేట్లు ఎత్తి 4.3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 20టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.34టీఎంసీ నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని పోలీస్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ నుంచి అంతర్గాం, మంచిర్యాలకు రాకపోకలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు.

పార్వతీ బ్యారేజ్ నుంచి...

మంథనిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం సమీపంలోని పార్వతీ (సుందిళ్ల) బ్యారేజ్‌లో మంగళవారం సాయంత్రం వరకు భారీగా వరద నీరు పెరిగింది. పైన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులో గేట్లు ఎత్తి నీరు దిగువ ప్రాంతానికి వదలడంతో పార్వతీ బ్యారేజ్‌లోకి 4 లక్షల 30వేల క్యూసెక్ల భారీ వరద నీరు వచ్చి చేరింది. అయితే ప్రాజెక్టులో ఉన్న 74 గేట్లు ఎత్తి ఉండటంతో వరద నీరు దిగువకు విడుదల అవుతుంది. రెండు రోజుల క్రితం బ్యారేజ్‌లో వరద నీరు తగ్గుముఖం పట్టగా మళ్లీ పైన ఎల్లంపల్లిలో గేట్లు ఎత్తడంతో దిగువకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.

13తులాల బంగారం పోగొట్టుకున్న యువకుడు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు 13తులాల బంగారాన్ని పోగొట్టుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని రంగాపూర్‌కి చెందిన రెడ్డిబోయిన రమేష్ హనుమకొండ జిల్లా వేలేరు గ్రామం నుంచి సొంత గ్రామానికి బయలుదేరాడు. ప్రయాణానికి ముందు అతను 13తులాల బంగారు ఆభరణాలు, కొన్ని సీతాఫలాలను ఒకసంచిలో ప్యాక్ చేసి తనబైక్‌కు తగిలించుకున్నాడు. వేలేరునుంచి బయలుదేరిన తర్వాత హుజూరాబాద్ మండలంలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామం వరకు ఆ సంచి బైక్‌కు ఉంది. కానీ ఆ గ్రామం దాటిన తర్వాత సంచి పోయినట్లు రమేష్ గుర్తించాడు. వెంటనే అతను వెనక్కి వెళ్లి వెతికాడు. కానీ ఆ సంచి ఆచూకీ లభించలేదు. గత ఆదివారం జరగగా రెండ్రోజుల పాటు వెతికాడు. అయినా సంచి దొరకకపోవడంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బంగారు ఆభరణాలు, సీతాఫలాలున్న సంచి ఎవరికైనా దొరికితే పోలీస్ స్టేషన్లో అప్పగించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గాంధీనగర్‌లో పట్టపగలు చోరీ



దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

ఇల్లందకుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోని గాంధీనగర్‌లో పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన గూడెపు మల్లమ్మ మంగళవారం ఉదయం 11గంటలకు ఇంటి ముందు వరండాలో పడుకొని ఉంది. కొద్దిసేపటికి వరండా పక్కనున్న రూమ్ యొక్క తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే గదిలో ఉన్నటువంటి బీరువాను తెరిచి చూడగా తాళం తీసి ఉంది. అందులో ఉన్న రూ.25వేలు దొంగలించినట్లు తెలిపింది. మల్లమ్మ ఫిర్యాదు మేరకు సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ క్రాంతి కుమార్ ఫింగర్ ప్రింట్ నిపుణులతో సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దసరా ప్రయాణికులకు ఆర్టీసీ లక్కీడ్రా

భగత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబరు 6వతేదీ వరకు ప్రయాణించిన వారికి లక్కీడ్రా వర్తిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న సెమీడీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్ సూపర్‌లగ్జరీ, లహరితోపాటు అన్నిరకాల ఏసీ బస్సుల్లో ప్రయాణం చేసిన వారికి లక్కీడ్రా నిర్వహించాలని సంస్థ నిర్ణయించిందని తెలిపారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఉమ్మడి జిల్లా లోని అన్ని ప్రధానబస్‌స్టేషన్లలో లక్కీడ్రా బాక్సులు ఉంటాయని, ప్రయాణం చేసిన టికెట్ల వెనుకభాగంలో అడ్రస్, ఫోన్‌నంబరు రాసిఅందులో వేయాలని సూచించారు. అక్టోబరు 8వతేదీన సాయంత్రం 4గంటలకు డ్రా తీయనున్నట్లు తెలిపారు.

మొదటి విజేతకు రూ.25 వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో విజేతకు రూ.10వేలను చెక్కులరూపంలో అందించనున్నట్లు పేర్కొన్నారు. లక్కీడ్రా తేదీల్లో ముందస్తు రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణి కులు కూడా అర్హులేనని తెలిపారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పోలీస్ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో వృద్ధురాలికి తూటా

- త్వరలో ఎక్స్‌పర్ట్ టీం పరిశీలన : సీఐ బిల్ల కోటేశ్వర్



కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామపంచాయతీ పరిధిలోని గుట్ట వద్ద పోలీస్ ఫైరింగ్ రేంజిలో గత శనివారం జరిగిన పోలీసుల ఫైరింగ్ శిక్షణ సందర్భంగా సమీపంలో ఉన్న బోనాలపల్లికి చెందిన అమృతమ్మ అనే వృద్ధురాలికి తుపాకీ తూటా తగిలి గాయమైందని బాధితురాలితో పాటు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ నుంచి పోలీస్‌కమిషనర్ వరకు ఏడాదికి ఒకసారి పోలీసుల వద్ద ఉన్న ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహిస్తుంటారు. కమిషనరేట్ పోలీసు లందరూ ఎలగందులలోని ఫైరింగ్ రేంజి గుట్ట వద్ద 300 మీటర్ల దూరంలో ఒక టార్గెట్‌ను ఏర్పాటు చేసి ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. టార్గెట్ వెనుక గుట్ట ఉండటంతో ఎవరికి ఎలాంటి హాకలుగ కుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. ఈ ప్రాక్టీస్ సమయంలో సమీ పంలోని గ్రామస్థులు జాగ్రత్తలు తీసుకో వాలని డప్పుచాటింపు కూడా చేయిస్తుం టారు. అయితే శనివారం కరీంనగర్ పో లీస్ కమిషనరేట్‌లోని నూతనంగా వచ్చిన కానిస్టేబుళ్లు ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. అయితే ఫైరింగ్ రేంజి గుట్ట వెనుకవైపున 500 మీటర్ల దూరంలో బోనాలపల్లి ఉం టుంది. ఈ పల్లెలోని ఇళ్ల వరకు తూటాలు వచ్చిపడినట్లు పల్లెవాసులు చెబుతున్నారు. అమృతమ్మ తొడ భాగంలో రాయివంటిది తాకి గాయంకాగా, అక్కడే ఒక ఖాళీ తూటా పడి ఉందని చెబుతున్నారు. ఈ తూటా తగలటంతోనే తనకు గాయమైం దని అమృతమ్మ చెబుతున్నది. అయితే 3, 4 దశాబ్దాల కాలం నుంచి పోలీసులు ఎలగందుల సమీపంలోని గుట్ట వద్దనే ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే ఎలగందుల ఫైరింగ్ రేంజి వద్ద గుట్ట నుంచి గ్రానైట్ వెలికితీస్తున్న కారణంగా ఆ గుట్ట ఎత్తు తగ్గటంతోనే తుపాకీ నుంచి వెలువడిన తూటాలు గుట్టపై నుంచి బోనాలపల్లి సమీపంలో పడుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే విషయమై కొత్తపల్లి ఎస్ఐ బిల్ల కోటేశ్వర్‌ను వివరణ అడగగా అమృతమ్మ అనే వృద్ధురాలికి గాయమైన మాట వాస్తవమేనని, ఒక తూటా కూడా లభించిందని, దీనిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఎలగందుల ఫైరింగ్ రేంజిలో పోలీసుల ఫైరింగ్‌కు భద్రతాపరంగా అనుకూలమా? లేదా? అనే విషయాన్ని తేల్చడానికి హైదరాబాద్ నుంచి ఒక ఎక్స్‌పర్ట్ టీం త్వరలో వస్తుందని, ఆ టీం రిపోర్ట్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీసులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేసే గుట్ట ప్రాంతం

ఏనాడూ ఇటువంటి ఘటన ఎదురుకాలేదు

- బోనాల నరేష్, ఎలగందుల మాజీ ఉపసర్పంచ్



నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. ఏడాదిలో 3, 4 సార్లు పోలీసులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. ఏనాడు కూడా ఇటువంటి ఘటన ఎదురుకాలేదు. బుల్లెట్‌లు తగిలిన దాఖలాలు లేవు. గుట్ట ఎత్తు తగ్గిపోవటంతో జరిగి ఉంటుందని భావిస్తున్నాం. భద్రతా చర్యలు తీసుకుంటూ ఫైరింగ్ రేంజిని కొనసాగించాలి,

వైభవంగా కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు


జగిత్యాల మండలంలో, రాయికల్ మండల కేంద్రంలో, కొడిమ్యాలలో వివిధ రూపాల్లో దర్శనం ఇచ్చిన అమ్మవారు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం మోతె శివారులోని అష్టలక్ష్మీ ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న దుర్గ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం కనకదుర్గ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. వేలాదిగా మాతలు, భక్తులతో తరలిరావడంతో అమ్మవారి మండపం కిటకిటలాడింది. సాయంత్రం పసుపుతో చేసిన హరిద్రాగణపతిని బాజ, భజంత్రీల మధ్య ఎదుర్కొన్నారు. అమ్మవారికి ఇష్టమైన వివిధ రంగుల గాజుల అలంకరణతో కనకదుర్గ అమ్మవారు విశేషంగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం దర్శనానికి వచ్చిన భక్తులకు బిక్షగా అన్న ప్రసాదం చేశారు. ఈకార్యక్రమంలో కనకదుర్గ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని వివిధ దేవాలయాలతో పాటు కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పట్టణంలోని కోటి నవదుర్గ, తిశక్తి, దుర్గాదేవి, బారతి సాయితి సమితి ఆధ్వర్యంలతో పాటు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపాల వద్ద ప్రత్యేక పూజలు వేదపండితులు నిర్వహించారు. అమ్మవారు బ్రహ్మచారిని అవతారం దర్శనం ఇచ్చింది. కాలేజీ గ్రౌండ్ ఆధ్వర్యంలో దుర్గాదేవి దేవాలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో స్వామి వారు సూర్యప్రభ వాహనంపై దర్శనం ఇవ్వగా అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష్మీ నరసింహా స్వామి అంజనేయ స్వామి అవతారంలో దర్శనం ఇచ్చారు. వాహనాలతో స్వామి వారు పురవీదుల గుండా దర్శనంకు రాగా మహిళలు వాకిటిలో కల్లాపు చల్లి మంగళ హారుతులతో స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాలలో దేవాలయ నిర్వహకులు పాల్గొన్నారు.

●రాయికల్: దుర్గా శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా రాయికల్ సంఘమిత్ర యూత్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మండపంలో దుర్గమ్మ మంగళవారం గాయత్రీ దేవి అలంకరణలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో భవానీ సేవా సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవి మండపంలో దేవీ నవరాత్రో త్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామ పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ ప్రత్యేక పూజలు, అబిషేకాలు నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాదం లతరాజు, నాయకులు క్యాస కోటేశ్వర్, భవానీ దీక్షాపరులు రాకేష్, సాయిచరణ్, శశికాంత్, విఘ్నేశ్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్టించిన దుర్గాదేవి రెండవ రోజు మంగళవారం గాయిత్రిదేవిగా భక్తులకు ధర్శనమిచ్చారు. అంతక ముందు ఆలయంలో అభిషేకం, అష్టోత్తర శతనామార్చన, సహస్ర తమలపాకులు, వివిద రకాల ఫలాలతో అర్చన, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి భాస్కర్ చేసారు. ఈ కార్యక్రమంలో హన్మాన్ సేవా సమితి సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

●పెగడపల్లి: పెగడపల్లి మండలంలో మంగళవారం గాయత్రీదేవి రూపంలో దుర్గా మాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రోత్సవాలో రెండవ రోజైన మంగళవారం గాయత్రీ రూపంలో అమ్మవారు దర్శనమివ్వగా భక్తులకు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పెగడపల్లి ఆలయంలో చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

●వెల్గటూర్: శరన్నవరాత్రులలో భాగంగా మండలం లోని వివిధ గ్రామాలలో మంగళవారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్గటూర్‌లో దుర్గామాత శ్రీ బ్రహ్మచారిణి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి నారింజ రంగు చీరను, గాజులతో అలంకరించారు. మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పులిహోరా, తీపి బొంది, శనగ గారెలు, శనగ ఉడాలు నైవేద్యం సమర్పించారు. స్తంభంపల్లి, పాషిగామ, పైడిపల్లి, కిషన్‌రావుపేట గ్రామాలలో. దుర్గామాతకు భవాని భక్తులు భక్తితో పూజలు చేశారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కిషన్‌రావుపేటలో శ్రీ దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారు శ్రీ గాయత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కట్టె పొంగలి నైవేద్యంగా సమర్పించారు.

●ఇబ్రహీంపట్నం: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు అమ్మవారు గాయత్రిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తితో నైవేద్యాలు సమరించారు.

●గొల్లపల్లి: దుర్గా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గామాత గాయత్రీ అలంకరణలో రెండో రోజు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చింది. గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దుర్గా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని శ్రీరాముల పల్లె, మల్లన్న పేట, శంకర్రావు పేట, వెంగళాపూర్, రాపల్లె, ఇస్రాజ్ పల్లె, వెన్గుమట్ల, లొత్తునూర్, చిల్వాకోడూర్, చెందోళి, రంగదాముని పల్లె, తిర్మలాపూర్ (పీడీ), భీంరాజ్ పల్లె, లక్ష్మీపూర్, రాఘవ పట్నం తో పాటు గొల్లపల్లి మండల కేంద్రంలో దుర్గా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారుల వేదమంత్రోచ్ఛరణల నడుమ దుర్గామాతను గాయత్రీ మాత అలంకరణలో ముస్తాబు చేసిన అనంతరం భక్తులకు దర్శనమిచ్చింది. మహిళల కుంకమార్చన పూజలు, మంగళహారతులు ఇచ్చి భవాని మాతకు ప్రత్యేక పూజలు చేశారు. భవానిదీక్షా స్వాముల దుర్గా మాత సంకీర్తనలు, భజన కార్యక్రమాలతో ఆలయాలు భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నాయి. భక్తుల దుర్గామాత నామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు మార్మోగుతున్నాయి. కాగా, గొల్లపల్లి ఆర్యవైశ్యా సంఘం భవనంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఉత్సవాలను ఆర్యవైశ్యా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ నిర్వాహకులు, భవానిదీక్షా స్వాములు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

(ఐదో పేజీ తరువాయి)

రోజుల్లోనే రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు పనిచేస్తు న్నారు. ఈ మేరకు కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, జడ్పీ అధికారులతో ఉన్నతాధికారులు ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జడ్పీ చైర్మన్ స్థానాల రిజర్వేషన్లను రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఖరారు చేయనున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లను కలెక్టర్ కేటాయించనున్నారు. ఎంపీ టీసీ, సర్పంచ్ స్థానాలను ఆర్డీవో ఖరారు చేయ నుండగా, గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల స్థానా ల రిజర్వేషన్లను ఆయా మండలాల ఎంపీడీవోలు కేటాయించనున్నారు.

●పూర్తయిన ఓటరు జాబితా..

పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల నిర్వహణకు వార్డుల వారీగా తుది ఓటరు జాబితా ఇప్పటికే పూర్తయింది. ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా కసరత్తు పూర్తయింది. ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మ్యాపింగ్ పూర్తి కాగా బ్యాలెట్ బాక్సులతో పాటు బ్యాలెట్ పేపర్ ముద్రణకు అనుగుణంగా సిద్ధంగా ఉంచారు. ఎన్నికల సిబ్బందికి పలు విడతలుగా శిక్షణ సైతం ఇచ్చారు.

●పల్లెల్లో ఆశావహుల సందడి..

పల్లెల్లో స్థానిక ఎన్నికలపై రాజకీయ పార్టీలతో పాటు ఆశావహులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుండడంతో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు పట్టించుకోని పలువురు ఓటర్లను సైతం ఆప్యాయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు తెలుసుకుంటున్నారు. యువతకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. తమను గెలిపిస్తే గ్రామానికి అవసరమైన పనులన్నీ చేసి పెడతామనే నమ్మకం కల్పించేలా గట్టిగా ప్రయత్నిస్తున్నారు. దీంతో పల్లెల్లో రాజకీయ హడావుడి పెరిగింది.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు..

-సత్యప్రసాద్, కలెక్టర్



జిల్లాలో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తాం. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఎన్నికలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఇందుకు అవసరమైన ప్రాథమిక కసరత్తు పూర్తి చేశాం. ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తాం.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

-ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శనం


విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ సుదర్శనం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుద ర్శనం అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలోని యామపుర్, వేములకుర్తి గ్రామలలోని 33/11 కేవి సబ్ స్టేషన్లలో పీడర్లకు బ్రేకర్లను స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఎస్ఈ సుదర్శనం మాట్లాడుతూ సబ్ స్టేషన్లలో రూ.20 లక్షలతో రెండు బ్రేకర్లను ఏర్పాటు చేసి వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. అన్ని సబ్ స్టేషన్లకు రెండవ ప్రత్యామ్నాయ 33కేవీ అంతర్గత లైన్లు నిర్మాణం చేస్తున్నామన్నారు. అందులో దాదాపు 70 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం అత్యంత తక్కువ సమయంలో రెండవ లైన్ నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. రైతులు మోటారు పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకొని ఓవర్ లోడ్, లో ఓల్టేజ్ సమస్యలు అధిగమించవచ్చన్నారు. రైతులకు లోడు భారం ఉంటే సిబ్బందికి తెలియజేస్తే మరో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం ఉన్నతాధికారులను విద్యుత్ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డివిజన్ డీఈ మధుసూదన్, డీఈ ఎంఆర్‌టి రవిందర్, ఎడియం అనిల్ కుమార్, ఇంచార్జి ఏడీఈ అమరెందర్, ఇబ్రహీంపట్నం ఏఈ సతీష్, సబ్ ఇంజనీర్, రాజేశ్, ఎస్ఎల్ఐ పుల్లూరి సాంబమూర్తి, లైన్‌మెన్ కోలిపాక రాజు, శ్యామ్, శ్రీధర్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు

మల్లాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగ దారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు ఎన్‌పీడీసీఎల్ సంస్థ కృషి చేస్తుందని జిల్లా ఎస్ఈ సుదర్శనం అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని వేంపల్లి వెంకట రావుపేట సబ్‌స్టేషన్‌లో నూతనంగా అమర్చిన ఇంటర్ లింకింగ్ లైన్‌ను స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వినయోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమ స్యలు లేకుండా ముందస్తుగా పరిశీలిస్తూ పరిష్క రించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ గంగారాం, కన్‌స్ట్రక్షన్ డీఈ గోపికృష్ణ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు సౌకర్యాలు కల్పించాలి

ధర్మపురి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హిందువుల పండుగ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయవద్దని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో ధర్మపురి తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి మాట్లాడుతూ హిందూ ఇతర మతస్తుల పండుగల కోసం కోసం పోటీ పడి లైటింగ్ ఇతర సౌకర్యాలు కల్పించడం కోసం పోటీ పడుతున్నట్లు తెలిపారు. మైనార్టీ ఓట్లకు ఆశపడి హిందువులపై ఆర్టీసీ చార్జీలు పెంచడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. దుర్గాదేవి నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ సందర్భంగా వెంటనే సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, ధర్మపురి మండల ఉపాధ్యక్షులు కోల రామన్న, స్వర్గం వీరేశం, ఓగేటి అంజయ్య, ప్రధాన కార్యదర్శులు కామెర ప్రభాకర్, జెల్ల వినోద్, మండల కార్యదర్శి ఉయ్యాల వెంకటేష్, నాయకులు గడ్డం శంకర్, నాయిని స్వామిగౌడ్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ నియామకం


లీగల్ సెల్ కన్వీనర్ రజాక్‌కు నియామకపత్రం అందజేస్తున్న జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ లీగల్ సెల్ కమిటీ సభ్యులకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు నియామక ఉత్తర్వులను అందించారు. కన్వీనర్‌గా సీనియర్ న్యాయవాది ఎం.డి.రజాక్, కో కన్వీనర్లుగా కస్తూరి రమేష్, మన్నె గంగాధర్, జాయింట్ కన్వీనర్లుగా వంగ వేణు, నేరెళ్ల శ్రీధర్, జనరల్ సెక్రటరీగా నల్ల రాజేందర్, జాయింట్ సెక్రెటరీలుగా గజ్జి గంగారాం, మద్దుల రోజలకు ఆయన నియామక ఉత్తర్వులు అందించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరంల సూచన మేరకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ నియామక ఉత్తర్వులు పంపినట్లు టీపీసీసీ లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్, సీనియర్ న్యాయవాది కోటగిరి వెంకటస్వామి తెలిపారు. ఈ సందర్భంగా నియామక ఉత్తర్వులు అందుకున్న న్యాయవాదులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, ఏజిపి అబ్దుల్ హఫీజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, కార్యదర్శి రాంప్రసాద్, న్యాయవాదులు తెడ్డు ఆనంద్, సురక్ష, కోటగిరి చైతన్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ జానకి

గొల్లపల్లి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి అన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమంను అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ మనం రోజు తినే ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన గింజలు, మిల్లెట్స్ అధికంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఇంటి ఆవరణలో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతం పౌష్టికాహారం తీసుకుంటామని గర్భి ణీలు, బాలింతలు, తల్లులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, తిరుమల, ఆశా కార్యకర్త రాధ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో జరిగిన మూడవ జూనియర్ డార్జిబాల్ నేషనల్ సెలక్షన్ ట్రయల్స్‌లో జగిత్యాల పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్, అభ్యాస పాఠశాలల విద్యార్థులు ఎంపికయినట్లు పాఠశాల కరస్పాండెంట్ గోగ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ బోగ శ్రీదేవిలు ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1నుంచి 3వ తేదీ వరకు గుజరాత్ లోని అహ్మదాబాద్‌లో జరిగే స్థాయి పోటీలకు విద్యార్థులు అభినవ్, రోహన్, శ్రీచందన, అవని, యశ్వసిని, సిరి చందన, యశశ్రీ, రేహాన్ ఉద్దీన్, శశాంక్‌లు పాల్గొంటారని ప్రకటనలో వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులను పాఠశాలల కరస్పాండెంట్ బోగ రవి, ప్రిన్సిపాల్ బోగ శ్రీదేవి, అకడెమిక్స్ అడ్మిన్ ఇంచార్జి నీరజా, పీఈటీ యశ్వంత్, మధు తదితరులు పాల్గొన్నారు.


నళినికి ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించాలి

-సీఎంకు జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాన మలి ఉద్యమంలో తన ఉద్యోగానికి రాజీనామా చేసిన డీఎస్పీ నళినికి ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ఉద్యోగులు నిరుద్యోగులు ఉద్యోగ నియామకాల్లో వివక్షకు గురవుతున్నారని డీఎస్పీ నళిని తన ఉద్యోగానికి రాజీనామా చేసిందన్నారు. తమ ఉద్యోగాలు తమకే కావాలని తెంగాణ రాష్ట్ర సాధనతో నీళ్లల, నిధులు, నియమకాల్లో తమకు న్యాయమైనా వాటా దక్కుతుందని బావించి తెలంగాణ రాష్ట్రం సాధనకు ఊరు వాడ పల్లె, పట్నం అన్ని కదిలాయని అన్నారు. గ్రూప్-1 కేటగిరిలో డీఎస్పీ ఉద్యోగానికి నళిని రాజీనామా చేసి రాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యమ కాలంలో ఉద్యోగం కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అనారోగ్యంతో ఉన్న ఆమె పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించంతో పాటు ఉచితంగా వైద్యం అందించాలని జీవన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్


లబ్ధిదారుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మల్లాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలో మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను మల్లాపూర్ ఎండీవో కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా పింఛన్లు అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రజలు, అభివృద్ధి, యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యను పక్కన పెట్టి కల్లబొల్లి మాటలతో తప్పుదోవ పట్టిస్తూ కాలం వెల్లదిస్తున్నరని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలోని సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, వచ్చే స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ పార్టీని ఆదారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

●కోరుట్ల రూరల్: మహిళల సంపూర్ణ ఆర్యోగంతోనే బలమైన కుటుంబంగా ఎగుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యాక్రమంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలు, గర్భిణీలకు నిర్వహిస్తున్న పౌష్టిక ఆహార విలువలపై వివరిస్తూన్న తీరును పరిశీలించి పలు అంశాలను ఎమ్మెల్యే వివరించారు. అనంతరం ప్రాథమిక కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరుతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, డాక్టర్ మణిదీప్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ భారతి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు పిడుగు రాధ -సందయ్య, వనతడుపు ఆంజయ్య, గడికోప్పుల గోపాల్, అనంత స్వామి, మోహన్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. 45 మంది లబ్ధిదారులకు రూ.13,22,000 విలువగల చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పెర్ల సత్యం, పహీం, దారిశెట్టి రాజేష్, బాస్కర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మెట్‌పల్లి పట్టణ, మండలానికి చెందిన 13,98,600 సీఎంఆర్ఎఫ్ చెక్కులను 52 మంది లబ్ధిదారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్‌గౌడ్ సూచించారు. మల్లాపూర్ మండలంలోని అయా గ్రామాల శివారులోని గోదావరి నది మంగళవారం నిండుగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి నీటి ప్రవహం ఉధృతంగా ప్రవహించడంతో గోదావరి నది నిండుగా ఉరకలు వేస్తోంది. మొగిలిపేట గ్రామ శివారులోని గోదావరికి నదికి సమీపంలో ఆలయం ఉన్నందున నదిలో పుణ్య స్నానాలు చేయడానికి భక్తులు వస్తున్నారు.

గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున భక్తులు జాగ్రత్తలు ఉండగా ఉండాలని, నది లోపలికి వెళ్లకూడదని మల్లాపూర్ తహసీల్దార్ రమేష్‌గౌడ్ భక్తులకు సూచించారు. నదిలో నిండుగా నీరు పుష్కర ఘాట్‌పై నుంచి ప్రవహిస్తుందున్న భక్తులు, మత్స్యకారులతో పాటు ఇతరులు ఎవరైనా సరే నదిలోకి వెళ్లొదన్నారు.

వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు


ధర్మపురిలో బతుకమ్మ వేడుకల్లో మంత్రి అడ్లూరి సతీమణి కాంతాకుమారి

ధర్మపురి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బతుకమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి ఆధ్వర్యంలో మాజీ మహిళా కౌన్సిలర్లు, మెప్మా ఆర్‌పీలు, మహిళలు రకరకాల పూలతో పేర్చి, అందంగా అలంకరణ చేసిన బతుకమ్మలను ఒక చోట ఉంచారు. క్షేత్రంలోని వివిధ వీధుల్లో, గోదావరి నది వద్ద అనేక మంది మహిళలు, యువతులు, చిన్నపిల్లలు రక రకాల పూలతో పేర్చి, అందంగా అలంకరణ చేసిన బతుకమ్మలను ఉంచి ఆటలు ఆడి పాటలు పాడారు. బతుకమ్మ, గౌరీ దేవి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. రాత్రి వేళలో కోనేరు, గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సతీమణి కాంతాకుమారి, ధర్మపురి సీఐ సతీమణి ఎ.అలేఖ్య, ఎస్ఐ సతీమణి సౌమ్య, మాజీ కౌన్సిలర్లు వేముల నాగలక్ష్మి, సంగనభట్ల సంతోషి, జక్కు పద్మ, గరిగె అరుణ, శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మధ్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి శోభ పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

బీర్‌పూర్, సెప్టెంబరు 23: బీర్‌పూర్ మండలంలోని ఇందిరానగర్ గ్రామం అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం యువకులు శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిలో ఏర్పడిన భారీ గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బంది పడటాన్ని గమనించిన ఇందిరా నగర్‌కు చెందిన యువకుడు పూడూరి రాజు కుమార్ ట్రాక్టర్‌తో మట్టి మూడు ట్రిప్పుల మట్టిని తెప్పించి యువకులు అరికిల్ల శంకర్ మరికొంత మంది సమాయంతో గుంతలన్నీ పూడ్చి వేయించారు. ఈసందర్భంగా రాజు కుమార్‌ను పలువురు వాహనదారులు అభినందించారు.

అంజన్న సన్నిధిలో పూజలు

మల్యాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్నను బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునితరెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ జడ్పీటీసీ పి.ప్రశాంతి మంగళవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. వారి వెంట మండల బీఆర్ఎస్ నాయకులు జనగాం శ్రీనివాస్, ప్రవీన్, దశరథం, అజర్, రియాజ్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ కుటుంబసమేతంగా అంజన్నను దర్శించుకున్నారు.

మీడియేషన్ యాక్ట్‌తో సత్వర న్యాయం

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన మీడియేషన్ చట్టంతో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, పసునూరి శ్రీనివాస్‌లు ఇటీవల మీడియేషన్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆకుల ప్రవీణ్ ఉన్నారు.